# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 228 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 23 జూలై 2026 | పేజీలు : 07 | పేజీలు : 5/-


ట్రైనీ ఉదయ్ కృష్ణారెడ్డి

## కేసు విచారణ

- సోమవారానికి వాయిదా వేసిన హైకోర్టు
- విచారణకు రంగంలోకి దిగిన ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య

2





పదేళ్లల్లో 152 పేపర్

## లీక్ కేసులు

- ఒక్క దాంటలో కూడా దోషులను తేల్చలేదు
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే..
- ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాల్సిందే..
- రాహుల్ గాంధీ డిమాండ్

**న్యూఢిల్లీ, జూలై 22 (మన చౌరాస్తా) :** గత 10 ఏళ్లల్లో 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయని కాంగ్రెస్ నేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక్క కేసులో కూడా దోషులు ఎవరో తేలలేదని అన్నారు. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై ఉద్యమిస్తున్న యువతకు మద్దతుగా రాహెల్ గాంధీ బుధవారం ఏర్పాటు చేసిన పత్రికాసమావేశంలో కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విద్యావ్యవస్థ మొత్తం రిగ్గింగ్ బారిన పడిందని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పనితీరు అసమర్థంగా, అవినీతిమయంగా ఉందని ఆరోపించారు.

..:: మిగతా 2లో

# అవి నీట్ ప్రశ్నపత్రా..

# పల్లీబఠానీలా..!

### కేంద్రంపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ధ్వజం

కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టుకు నిరసన

కొడంగ్‌లో రేవంత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సిఎం డిమాండ్



**వికారాబాద్, జూలై 22 (మన చౌరాస్తా) :**

నీట్ ప్రశ్నపత్రాలను పల్లీబఠానీల్లా కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తదితరుల అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టింది. బుధవారం కొడంగల్‌లో జరిగిన ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్నపత్రాలను అమ్ముకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాజకీయ పార్టీలకతీతంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని, ప్రజా ఆందోళనలు పరిగణనలోకి తీసుకుని ధర్మేంద్ర ప్రదాన్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రాలు అమ్ముకున్న వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టాలన్నారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ధర్మేందప్రదాన్ చెలగాటం ఆడారు. ఆయన రాజీనామా చేయాలని ఢిల్లీలో యువత ఆందోళన చేపట్టింది. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజా సమస్యల్ని ప్రస్తావించడం ప్రజాప్రతినిధుల బాధ్యత. 20వ తేదీ నుంచి ప్రారంభమైన పార్లమెంట్ ఉభయసభల్లో.. ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై చర్చించాలని కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి అడిగినా ప్రభుత్వం అనుమతించడం లేదు. లోక్‌సభ స్పీకర్ అంగీకరించడం లేదు. ప్రజాస్వామ్యానికి ఇది దురదృష్టకరమైన పరిస్థితి. దిల్లీ పోలీసులు రాహుల్‌గాంధీని కొడితే ఆయన ముక్కులో నుంచి రక్తం కారింది. ఈ దేశం కోసం రక్తం చిందించడంలో రాహుల్ గాంధీ మొదటివారు కాదు.. చివరివారూ కాదు. ఆనాడు మహాత్మాగాంధీ తెల్లదొరలతో కొట్లాడి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారు.

..:: మిగతా 2లో



3 లో

### భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి రండి

- ప్రధాని మోడీని ఆహ్వానించిన సీఎం చంద్రబాబు
- సుమారు 30 నిముషాల పాటు చర్చ

సీసీఐ పునరుద్ధరణపై

### మీ వైఖరి ఏంటి?

- జిల్లా అభివృద్ధికి సిమెంట్ ఫ్యాక్టరీ అతి ముఖ్యం
- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేత కేటీఆర్ లేఖ

4 లో










5 లో

## విద్యార్థుల భవిష్యత్ టీచర్ల చేతుల్లోనే..

- విద్యా వ్యవస్థలోనూ పారదర్శకత ఉండాలి
- జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

# కాంగ్రెస్ ఓట్లపై బీజేపీ నజర్!

- **కొడంగ్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు**
- **ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోండి**
- **సర్‌పై బూత్ లెవల్ కార్యకర్తలతో సీఎం రేవంత్ రెడ్డి**



**వికారాబాద్, జూలై 22 (మన చౌరాస్తా):** కొడంగల్ ప్రజలు, కార్యకర్తల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్‌కు రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్‌లో పర్యటించిన సీఎం.. స్థానిక నాయకులు, బీఎలఏలతో సర్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో దెబ్బతీయాలంటే పునాదులు దెబ్బతీయాలని చూస్తున్నారు. పేర్లు వేరైనా బీఆరఎస్, బీజేపీ రెండూ ఒక్కటే. కొడంగల్‌లో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించాలని చూస్తున్నారు. ఇంట్లో పొగ పెడితే రేవంత్ రెడ్డి బయటకు రాకుండా ఉంటారని కుట్రలు చేస్తున్నారు. ఎదురు నిలబడలేక దొంగదెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారు. కొడంగల్‌లో కుట్రలు చేసేవారిని బొంద పెట్టే బాధ్యత మీపై ఉందని సిఎం అన్నారు. 119 నియోజకవర్గాలను అభివృద్ధి చేయడం కోసం రోజుకు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవడంలేదని సీఎం తెలిపారు. ఆగస్టు 3 వరకు సర్ గడువు ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,51,255 ఓట్లున్నాయని.. కానీ 1,96,626 ఓట్లు మాత్రమే సర్‌లో నమోదు చేసుకున్నారని.. మిగిలిన 54,635 నమోదు చేసుకోలేదని సీఎం తెలిపారు. మొత్తం ఓట్లలో ఇంకా 22 శాతం నమోదు జరగలేదని చెప్పారు. ఆ ఓట్లను తొలగిస్తే ప్రమాదం పొంచి ఉందన్నారు. వారందరినీ తిరిగి నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎలఏలపై ఉందన్నారు. ఓటు పోగొట్టుకుంటే గుర్తింపు ఉండదని సీఎం తెలిపారు. ఓటు లేకుంటే చనిపోయిన వారితో సమానమన్నారు. కార్యకర్తగా ఇంటింటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ ఫారం నమోదు చేయించాలని నేతలకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీ, బీఆరఎస్ ఒక్కటై కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయాలని గూడుపుఠాణి చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల వివరాలు ఎన్నికల అధికారులకు అందించాల్సిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపైనే ఉందన్నారు. ఈనెల 30లోగా నూటికి నూరు శాతం కొడంగల్ నియోజకవర్గంలో ప్రక్షాళన పూర్తి కావాలని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటు కోల్పోవడానికి వీల్లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.




## పదేళ్లలో 152 పేపర్ లీక్ కేసులు

(మొదిపేజీ తరువాయి)

ఆయన రాజీనామా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఆయన రాజీనామాకు విద్యార్థులు పట్టుబడుతున్నారని, ఇది సరైన డిమాండేనని వ్యాఖ్యానించారు. ఈ దుస్థితికి ప్రతిబింబంగా మారిన ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. గత పదేళ్లల్లో సుమారు 152 పేపర్ లీక్ ఉదంతాలు వెలుగు చూశాయి. అంటే.. సగటున వారానికి ఒక పేపర్ లీక్ జరిగింది. కోట్ల మంది విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడింది. కానీ ఒక్క కేసులో కూడా దోషులెవరో తేలలేదు. ఇలా ఎందుకు జరిగిందని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఒకప్పుడు దేశానికి సంపదగా ఉన్న విద్యారంగం ఎన్డీయే పాలనలో ధ్వంసమైందని రాహుల్ గాంధీ ఆరోపించారు. పేద, మధ్య తరగతి వర్గాలకు విద్య భారంగా మారిందని చెప్పారు. కోచింగ్‌పై నీట్ అభ్యర్థుల వార్షిక ఖర్చు రూ.1.32 లక్షల కోట్లని అన్నారు. ఇది విద్యారంగం వార్షిక బ్జడెట్ రూ.1.42 లక్షల కోట్లకు దాదాపు సమానమని వ్యాఖ్యానించారు. సంపన్నుల కోసమే ఉద్దేశించిన ఈ వ్యవస్థలో పేదలకు స్థానం లేదని అన్నారు. సోమవారం నిరసనల సందర్భంగా విద్యార్థులపై లాఠీ చార్జి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సిందేనని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యార్థుల విషయంలో ఏం జరుగుతోంది. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని యువత కోరుతోంది. కానీ, ఈ ప్రభుత్వం శాంతియుతంగా నిరసనలు చేస్తున్న వారిపై లాఠీచార్జ్ చేయించింది. మధ్యతరగతి కుటుంబాలకు చదువు ఆర్థిక భారంగా మారింది. విద్యపై రూ.1.4లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు కేంద్రం చెబుతోంది. కానీ, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయి. దీని వల్ల 7.50కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారు. విద్యార్థులు ఎంత బాధపడుతున్నా.. ఈ ప్రభుత్వం లెక్కచేయట్లేదు. ఈ పేపర్ లీకేజీ ఘటనల్లో ఇప్పటివరకు శిక్షపడిన నేరస్థుల సంఖ్య సున్నా అని రాహుల్ విమర్శించారు. దేశ యువతకు ఉద్యోగాలు లేవు. విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలను ఈ ప్రభుత్వం నాశనం చేస్తోంది. మన దేశంలో చైనా వస్తువుల సంఖ్య పెరిగింది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. బ్యాంకులను బడా వ్యాపారులు లూటీ చేస్తున్నారు. ఏఐ వల్ల కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు పోతున్నాయి. కేంద్రం విధానాల వల్ల పేదలు, విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యార్థులంటే మనకు శత్రువులు కాదు. ఈ దేశ భవిష్యత్తు అన్న విషయం కేంద్రం గుర్తుంచుకోవాలని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని యువత డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని యువత కోరుకుంటోంది. ఆందోళన చేస్తోన్న యువతపై దాడి చేసిన వారికి శిక్ష పడాలని కోరుతోంది. ఇక, ఈ వైఫల్యాలకు గానూ ప్రధాని క్షమాపణలు చెప్పాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల డిమాండ్లకు మేం పూర్తి మద్దతు ప్రకటించాం అని రాహుల్ వెల్లడించారు. విద్యార్థుల ఆందోళనను మేం రాజకీయాలకు వాడుకోవట్లేదు. ప్రతిపక్ష నేతగా ప్రజల గళం వినిపించడం నా బాధ్యత. దీనిపై పార్లమెంట్‌లో మాట్లాడేందుకు కేంద్రం అవకాశం ఇవ్వట్లేదు. అందుకే విద్యార్థులకు మద్దతుగా వీధుల్లోకి వచ్చాం. నిన్న నిరసనల్లో నా పట్ల జరిగిన దానికి బాధపడటం లేదు. విద్యార్థులకు జరుగుతోన్న నష్టం విషయంలోనే బాధగా ఉంది. పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ప్రజల కోసం ఎన్ని దెబ్బలు తినేందుకైనా నేను సిద్ధం అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు.

## ట్రైనీ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు విచారణ

- **సోమవారానికి వాయిదా వేసిన హైకోర్టు**
- **విచారణకు రంగంలోకి దిగిన ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య**



**హైదరాబాద్, జూలై 22 (మన చౌరాస్తా) :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్‌పై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. కేసుకు సంబంధించిన వివరాలు సమర్పించాలంటూ పోలీసులను ఆదేశించింది. పిటిషనర్ ట్రైనీ ఐపీఎస్ గా ఉన్నారని.. అప్పటి వరకు తదుపరి చర్యలు చేపట్టకుండా పోలీసులను ఆదేశించాలంటూ అతని తరపు న్యాయవాది కోరినా హైకోర్టు అంగీకరించలేదు. తప్పుడు ఆరోపణలతో పోలీసులు కేసు నమోదు చేశారని, ఆ కేసును కొట్టివేయాలని ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్‌లో కోరారు. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు మేరకు అతనిపై అత్తాపూర్ పీఎస్‌లో కేసు నమోదైంది. లైంగికంగా వేధించడంతో పాటు.. వ్యక్తిగత వీడియోలను తన భర్తకు పంపించి ఇబ్బందులకు గురి చేశాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తులో పోలీసులు వేగం పెంచారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసును పోలీసు ఉన్నతాధికారులు ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు బదిలీ అనంతరం డీసీపీ లావణ్య బుధవారం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీకి చేరుకుని దర్యాప్తు ప్రక్రియను ప్రారంభించారు. కేసులో ఫిర్యాదు చేసిన ట్రైనీ ఐపీఎస్ అధికారి వాంగ్మూలాన్ని నమోదు చేయడానికి ఆమె అకాడమీకి వెళ్లారు. అకాడమీలో ఉన్నతాధికారుల సమక్షంలో ట్రైనీ ఐపీఎస్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నారు. ఈ వాంగ్మూలం కేసు దర్యాప్తులో అత్యంత కీలకంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలు, అందుబాటులో ఉన్న డిజిటల్, ఇతర ఆధారాలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించనున్నారు. మహిళా భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఈ కేసును ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు బదిలీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసు దర్యాప్తు సమయంలో అకాడమీలోని అధికారులు, సహచర ట్రైనీలు, ఇతర సంబంధిత వ్యక్తుల వివరాలను కూడా సేకరించే అవకాశం ఉంది. కేసుకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలించి వాస్తవాలను ప్రత్యేక దర్యాప్తు బృందం వెలుగులోకి తీసుకురానుంది. డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ స్వయంగా పర్యవేక్షిస్తున్న ఈ విచారణలో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఇచ్చే వాంగ్మూలం కీలక ఆధారంగా మారనుంది. ఈ తాజా పరిణామాలతో ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తు మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది.

## అదుపుతప్పి టూవీలర్‌ను ఢీకొన్న ట్యాంకర్

**యువకుడు మృతి..మరొకరికి తీవ్ర గాయాలు**

**హైదరాబాద్, జూలై 22 (మన చౌరాస్తా) :** ఔటర్‌ను ఆనుకుని నార్సింగి 'పుప్పాలగూడ టోల్‌గేట్ వద్ద వాటర్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చిన ట్యాంకర్.. బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న సుశీల్ కుమార్(28) అనే యువకుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం తర్వాత అదుపు తప్పిన ట్యాంకర్ మరో కారు, స్కూటీని కూడా ఢీ కొట్టింది. దీంతో మొత్తం మూడు వాహనాలను వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. సమాచారం అందిన వెంటనే నార్సింగి పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ట్యాంకర్ డ్రైవర్ రంజిత్ సింహాను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. అలాగే గాయపడిన సురేష్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. సుశీల్ మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఆగివున్న లారీని ఢీకొన్న డీసీఎం

**ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ మృతి**




**పెద్దపల్లి, జూలై 22 (మన చౌరాస్తా) :** రామగుండం ఎన్టీపీసీ రాజీవ్ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చత్తీస్‌గఢ్‌కు చెందిన వ్యక్తులు మృతిచెందారు. గోదావరిఖని వైపు వెళ్తున్న ఓ లారీ టైరు పంక్చర్ కావడంతో రోడ్డుపై నిలిపివేయగా, అదే మార్గంలో చత్తీస్‌గఢ్ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం వెనుక నుంచి లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం క్యాబిన్ పూర్తిగా ధ్వంసమై డ్రైవర్, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందగా, క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసు సిబ్బంది బయటకు తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ డ్రైవర్ కూడా మృతి చెందాడు. మృతుడిని మనోహర్‌గా గుర్తించగా, క్లీనర్ వివరాలు ఇంకా తెలియరాలేదు. ఇద్దరూ చత్తీస్‌గఢ్‌కు చెందిన వారేనని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎన్టీపీసీ పోలీసులు వెల్లడించారు.



## కొత్తకొండలో వరుణయాగం

**పాల్గొన్న మంత్రి పొన్నం**

**హనుమకొండ, జూలై 22 (మన చౌరాస్తా) :** హనుమకొండ జిల్లా కొత్తకొండలోని భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో వరుణయాగం, యజ్ఞయాగాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి 108 కలశాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కాకతీయుల కాలం నాటి భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయం మహిమగల క్షేత్రమని, ఈ ప్రాంత ప్రజలకు అపారమైన విశ్వాసం ఉన్న దైవమని తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు పుష్కలంగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని స్వామి వారిని ప్రార్థించినట్లు చెప్పారు. ఎల్ నినో పరిస్థితుల కారణంగా వర్షాలపై శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ, భగవంతుడిపై విశ్వాసంతో తెలంగాణ వ్యాప్తంగా దేవాలయాల్లో వరుణయాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ ఇంచార్జి మంత్రిగా బోనాల ఉత్సవాల సందర్భంగా అక్కడి దేవాలయాల్లోనూ మంచి వర్షాలు కురవాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించిన వరుణయాగం రాష్ట్రానికి శుభఫలితాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అవి నీట్ ప్రశ్నపత్రా.. పల్లీబఠానీలా..!

(మొదటి పేజీ తరువాయి)

గాంధీజీని పొట్టన పెట్టుకున్న గాడ్సే వారసులు మీరు అంటూ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక్ చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు. ఆడపిల్లలపై దాడి చేశారని.. విద్యార్థుల తలలు పగలగొట్టారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడంలేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా? లేక కిడ్నాప్ చేశారో తెలియదన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని చెప్పుకొచ్చారు. పేపర్ లీక్‌పై పార్లమెంటులో చర్చ జరగకుండా అడ్డుకున్నారని.. రాహుల్ గాంధీపై పాశవిక దాడితో ఆయన రక్తం నేలకు చిందిందన్నారు. దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని.. మంత్రి పదవి కూడా చేపట్టలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడి విద్యార్థుల ప్రాణాలు బలిగొందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని.. అప్పుడే ఆ సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టి ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదన్నారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చిందని విమర్శించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విద్యార్థులు నిరసన తెలిపారని అన్నారు. లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదని.. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అందరం కలిసి పోరాటం చేసి మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తొలుత రేవంత్‌రెడ్డి నివాసం నుంచి కొడంగల్‌లోని అంబేద్కర్ కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో స్థానిక నేతలు భారీ ఎత్తున పాల్గొన్నారు. బిజెపికి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.




## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**భీమదేవరపల్లి, జూలై 22 (మన చౌరాస్తా) :** భీమదేవరపల్లి మండల కేంద్రంలో బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమం-రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశీస్సులతో అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పోలు సదానందంకు రూ.60 వేల, మాచర్ల రజనీకాంత్‌కు రూ.60 వేల, మార్పాటి లక్ష్మికి రూ.60 వేల, పోలు కొమురయ్యకు రూ.38 వేల, వేముల మల్లయ్యకు రూ.33 వేల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ బీసీ సెల్ అధ్యక్షుడు డబ్బా శంకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు సభ్యుడు చాగంటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పచునూరి కరుణాకర్, పోలు కొమురయ్య, పిట్టల మొగిలి, కొదురుపాక బన్నీ తదితరులు పాల్గొన్నారు.





# పార్లమెంట్‌లో గందరగోళం

## విపక్షాల నిరసనలతో హోరెత్తిన సభ

## నల్ల చొక్కలాతో పార్లమెంట్ ముందు విపక్షాల నిరసన

**న్యూఢిల్లీ, జూలై 22 (మన చౌరాస్తా) :** వరుసగా మూ2డో రోజు కూడా పార్లమెంట్‌లో గందరగోళం నెలకొంది. విపక్ష సభ్యులు వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టబట్టడంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. బుధవారం కూడా లోక్‌సభ, రాజ్యసభలో గందరగోలం నెలకొన్నది. దీంతో రెండు సభలు 12 గంటల వరకు వాయిదా పడ్డాయి.తాము ఇచ్చిన వాయిదా తీర్మానాల పై చర్చ చేపట్టాలని లోక్‌సభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. సభను ఆర్డర్‌లోకి తెచ్చేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. కానీ ఫలితం కనిపించలేదు. ప్రశ్నోత్తరాల సమయం జరిగే రీతిలో విపక్షాలు సహకరించాలని ఆయన కోరారు. ఎటువంటి సమస్యపైన అయినా చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. కానీ విపక్ష సభ్యులు వినిపించుకోలేదు. నినాదాలు చేశారు. దీంతో సభను మధ్యాహ్నం 12 గంటలవరకు వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా విపక్షాలు సీజేపీపై లాఠీచార్జ్ అంశాన్ని చర్చించాలని పట్టుపట్టాయి. కానీ చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ వ్యతిరేకించారు. గందరగోళ నేపథ్యంలో సభను 12 వరకు వాయిదావేశారు. మరో వైపు విపక్ష ఎంపీలు ఇవాళ నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఆవరణలో ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. నీట్ పేపర్ లీకేజీ అంశంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా నల్ల దుస్తులు ధరించినట్లు కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా ఆరోపించారు.



భోగాపురం ఎయిర్‌పోర్టు

# ప్రారంభోత్సవానికి రండి

- **ప్రధాని మోడీని ఆహ్వానించిన సీఎం చంద్రబాబు**
- **సుమారు 30 నిముషాల పాటు వివిధ అంశాలపై చర్చ**
- **పలువురు కేంద్రమంత్రులతోనూ బాబు వరుస భేటీలు**
- **గోదావరి, కావేరీ అనుసంధానంపై పాటిల్‌తో చర్చలు**

**న్యూఢిల్లీ, జూలై 22 (మన చౌరాస్తా):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానిని ఆహ్వానించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చేందుకు ప్రధాని మోదీ అంగీకరించినట్లు తెలుస్తోంది. సుమారు 30 నిమిషాలకు పైగా చంద్రబాబు, మోదీ ముఖాముఖీ భేటీ అయ్యారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చలు జరిగినట్లు సమాచారం. ఈరోజు (బుధవారం) చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు కూడా ప్రధానిని కలిశారు. ప్రధానితో చంద్రబాబు భేటీ సందర్భంగా ఆసక్తికర సన్నివేశం జరిగింది. టీడీపీ ఎంపీ అప్పలనాయుడిని భోగాపురం విమానాశ్రయం ఉన్న స్థానిక ఎంపీ అంటూ ప్రధాని మోదీకి ఆత్మీయంగా పరిచయం చేశారు. అప్పలనాయుడు నాకు తెలుసు... ఆయన ప్రతిరోజూ సైకిల్‌పై పార్లమెంటుకు వస్తున్నారు' అంటూ ఎంపీని ప్రధాని అభినందించారు. చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ అనంతరం పలువురు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర మంత్రి పీయుష్ గోయల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సుమారు 50 నిమిషాలు పాటు జరిగిన సమావేశంలో ఏపీకి కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులు, పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆపై కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు.ఇందులో భాగంగా కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. గోదావరి ` కావేరీ నదుల అనుసంధానంపై కీలక చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. గోదావరి ` కావేరీ అనుసంధానంపై భాగస్వామ్య రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం నుంచి కావేరీ అనుసంధానం కన్నా బనకచర్ల నుంచి కావేరీ అనుసంధానం మంచిదని కేంద్ర జల్‌శక్తి శాఖ సూచించినట్లు తెలుస్తోంది. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని జల్‌శక్తి శాఖ.. అన్ని రాష్ట్రాలు భాగస్వామ్య పక్షాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరారు. సముద్రంలోకి నీరు పోవడం కంటే.. ఉపయోగంలోకి వస్తే బాగుంటుందని కేంద్ర జల్‌శక్తి మంత్రికి సీఎం సూచించారు. అన్ని రాష్ట్రాలను ఒప్పిస్తే కేంద్ర ప్రతిపాదనతో తనకు అభ్యంతరం లేదని.. అందుకోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరగా.. ఇందుకు కేంద్ర జల్‌శక్తి శాఖ అంగీకరించినట్లు తెలుస్తోంది.



# చలో సంసద్‌పై పోలీసుల లాఠిన్యం

### అత్యవసర చర్చకు సుప్రీం తిరస్కరణ

**న్యూఢిల్లీ, జూలై 22 (మన చౌరాస్తా) :** కాక్రోచ్ జనతాపార్టీ 'చలో సంసద' మార్చ్‌లో భాగమైన నిరసనకారులపై పోలీసు లాఠీఛార్జ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అయితే.. దాని అత్యవసర విచారణకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని.. అలాగే పిటిషనర్ కూడా తన సమయాన్ని వృథా చేసుకోవద్దని ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నిరసనకారులపై పోలీసు చర్యకు సంబంధించిన వీడియోల గురించి పిటిషనర్ తరపు న్యాయవాది ప్రస్తావించగా..'మాకు వీడియోలు చూసే సమయం లేదు' అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఈ పిటిషన్ అత్యవసర విచారణకు ఢిల్లీ హైకోర్టు కూడా నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ అంశంలోకి తమను లాగొద్దని వ్యాఖ్యానించింది. దాంతో ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ లాఠీఛార్జిపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని పిటిషనర్ కోరారు. నీట్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సంస్కరణలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన చలో పార్లమెంటు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వేల మంది సీజేపీ మద్దతుదారులు పార్లమెంటువైపు దూసుకురావడం, బారికేడ్లను దాటి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకుని బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, లాఠీఛార్జి చేయడంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. పలుచోట్ల రాళ్లు రువ్వడం, ఘర్షణ పడటం, తోపులాటలతో అటు పోలీసులు, ఇటు ఆందోళనకారులు గాయపడ్డారు. చాలా మంది రక్తమోడుతున్న వీడియోలు వైరలయ్యాయి. వీటిని చూపుతూ విచారణ కోరారు. అయితే సుప్రీం ప్రధాన న్యాయమూర్తి వాటిని తిరస్కరించారు. అత్యవసరంగా చర్చించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.


(ఫైల్)

# ప్రధాని ఇంటిముందు ధర్నాకు కాంగ్రెస్ మాస్టర్ ప్లాన్

- **ఖర్గే నివాసానికి వెళ్లి.. గుట్టుచప్పుడు కాకుండా ధర్నా**
- **పోలీసులను ఆయోమయంలోకి నెట్టి కాంగ్రెస్ తీరు**

**న్యూఢిల్లీ, జూలై 22 (మన చౌరాస్తా) :** ఢిల్లీలోని లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని మోదీ నివాసం ముందు మంగళవారం కాంగ్రెస్ నేతలు మెరుపు ధర్నా చేపట్టిన విషయం పక్కా ప్లాన్‌తో చేపట్టినట్లు తెలుస్తోంది. నీట్ పేపర్ లీకేజీతో పాటు సీజేపీ కార్యకర్తలపై లాఠీఛార్జ్ అంశంలో ఆ ధర్నా నిర్వహించారు. అయితే కట్టుదిట్టమైన లోక్ కళ్యాణ్ మార్గ్‌కు కాంగ్రెస్ నేతలు అంతా ఎలా వెళ్లారని ఢిల్లీ పోలీసులు ఇప్పుడు ఆరా తీసే పనిలో పడ్డారు. వాస్తవానికి మంగళవారం కాంగ్రెస్ నేత మల్లిఖార్జున్ ఖర్గే బర్త్‌డే సెలబ్రేట్ చేసుకున్నారు. ఆ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు ఖర్గే ఇంటికి కాంగ్రెస్ నేతలు వెళ్లారు. సెంట్రల్ ఢిల్లీలోని రాజాజి మార్గ్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే నివాసం ఉన్నది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో పాటు అనేక మంది ఎంపీలు తొలుత మల్లిఖార్జున్ ఖర్గే ఇంటికి వెళ్లారు. ఖర్గేకు 84వ పుట్టిన రోజు విషెస్ తెలిపారు. కానీ కాంగ్రెస్ నేతలు అకస్మాత్తుగా మరో ప్లాన్ వేశారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు ప్రధాని ఇంటి వైపు ర్యాలీ తీశారు. ఖర్గే ఇంటికి కొన్ని మీటర్ల దూరంలోనే ప్రధాని మోదీ నివాసం ఉన్నది. అతి తక్కువ సమయంలోనే కాంగ్రెస్ ఎంపీలు .. ప్రధాని మోదీ గేటు ముందు చేరుకున్నారు. అక్కడే మెరుపు దాడికి దిగారు. సుమారు మూడు గంటల పాటు బైఠాయించారు. ఢిల్లీ పోలీసులు ఈ ఘటనతో షాక్ అయ్యారు. సెక్యూర్టీ ఉల్లంఘన జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కట్టుదిట్టమైన ప్రాంతంలోకి ఒకేసారి ఇంత మంది ఎలా వచ్చారని పోలీసులు ఆలోచిస్తున్నారు. అయితే ఖర్గే పుట్టినరోజు కావడం వల్ల ఆ ప్రాంతంలో భారీ సంఖ్యలో ఉదయం నుంచే జనం ఉన్నారని, రాజాజి మార్గ్‌లో అనేక వాహనాలను కూడా పార్క్ చేసినట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. 7 లోక్ కల్యాణ్ మార్గ్ లొకేషన్‌లో కాంగ్రెస్ ఎంపీలు ధర్నాకు దిగడం పట్ల ఢిల్లీ పోలీసులు కన్ఫ్యూజన్‌లో ఉన్నట్లు తెలిసింది. అయితే ఈ ఘటనకు ఎవరు బాధ్యత తీసుకుంటారో తెలియదు. కానీ ఢిల్లీ పోలీసులు మాత్రం సెక్యూర్టీ ఉల్లంఘన జరిగినట్లు అంగీకరిస్తున్నారు. ఖర్గే ఇంటికి చేరిన కాంగ్రెస్ నేతలు.. పార్లమెంట్ సమీపంలో ఉన్న విజయ్ చౌక్‌కు ర్యాలీ తీస్తారని భావించినట్లు కొందరు పోలీసులు చెప్పారు.

# సోనమ్ జీ దీక్ష విరమించండి

### ఎక్స్ వేదికగా అభిజీత్ దీప్కే విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, జూలై 22 (మన చౌరాస్తా):** సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్ష విరమించాలని కాక్రోచ్ జనతా పార్టీ అధినేత అభిజీత్ దీప్కే విజ్ఞప్తి చేశారు. దేశానికి వాంగ్‌చుక్ అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం దీప్కే తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్షను విరమించాలని కోరుతున్నాము. దేశానికి ఆయన అవసరం ఉంది. ఆయన ప్రాణం చాలా విలువైనది. దాన్ని మరింత ప్రమాదంలో పడేయకూడదు. డిమాండ్లు నెరవేరే వరకు జంతర్‌మంతర్ వద్ద శాంతియుత నిరసనలు కొనసాగుతాయి' అని రాసుకొచ్చారు. సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించటంతో హైకోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీసులు కొద్దిరోజుల క్రితం జంతర్ మంతర్ వద్ద నుంచి ఆయనను బలవంతంగా ఆస్పత్రికి తరలించారు. మొదట సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత ఢిల్లీ హైకోర్టు ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్‌ను గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రికి మార్చారు. ఆయన అక్కడి ఐసీయూలో ఉంటూనే.. డాక్టర్ల బలవంతపు ఫీడింగ్‌ను నిరాకరిస్తూ దీక్షను కొనసాగిస్తున్నారు.

# మంగళగిరి కోసం బాబుతో గొడవ పడ్డా

- **నిధులకు కొరత ఉన్నా, అభివృద్దిలో వెనకడుగు లేదు**
- **నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీలో లోకేశ్**



**గుంటూరు, జూలై 22 (మన చౌరాస్తా) :** మంగళగిరి నియోజకవర్గంలో రెండో రోజు పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. 'మన ఇల్లు ` మన లోకేశ' పేరిట మంత్రి నారా లోకేశ్.. ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టారు. రెండు రోజుల్లో 3,000 మందికి పట్టాలను పంపిణీ చేయనున్నారు. కొండవాలు ప్రాంతాలు, అటవీ భూములు, దేవాలయ భూముల్లో ఇల్లు నిర్మించుకొని దశాబ్దాలుగా ప్రజలు నివసిస్తున్నారు. దీంతో అర్హులైన పేద కుటుంబాలకు మంత్రి బట్టలు పెట్టి.. పసుపు, కుంకుమలతో పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి నిధుల కొరత ఉన్నా మంగళగిరిలో అభివృద్ధి ఆగట్లేదని తెలిపారు. మంగళగిరి అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబుతో కూడా గొడవ పెట్టుకుంటున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ నిధులతో ఇబ్బంది ఉంటే సీఎస్సార్ నిధులు, వివిధ ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుని అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. ఎక్కడా ఎలాంటి ఆరోపణలు లేకుండా పారదర్శకంగా ఇళ్ల పట్టాల పంపిణీ చేపట్టామన్నారు. ఇచ్చిన హామీ మేరకు బొట్టు పెట్టి ఇళ్ల పట్టాలను అందజేస్తున్నట్లు చెప్పారు. దేశం మొత్తం నిడమర్రు పాఠశాల గురించి మాట్లాడుకోవడం గర్వంగా ఉందన్నారు. ఇంటి పట్టాలతో పాటు భూగర్భ డ్రైనేజీ, 100 పడకల ఆసుపత్రి, నీటి సమస్య.. ఇలా అన్నింటికీ రెండేళ్లలోనే పరిష్కారం చూపిస్తున్నామని తెలిపారు. మంగళగిరి ప్రజలు ఓడించారనే కసితో ఇంకా బాగా పనిచేశానని చెప్పుకొచ్చారు. ప్రతిపక్షంలో ఉండగా 29 సంక్షేమ పథకాలను సొంత నిధులతో అమలు చేసి.. అధికారం ఇస్తే ఇంకెలా చేస్తానో అనే భరోసా కల్పించానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# బాసర ఆలయంలో వరుణయాగం

బాసర, జూలై 22 (మన చౌరాస్తా): చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారి సన్నిధిలో బుధవారం వరుణయాగం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురియక పోవడంతో వరుణ యాగం చేపట్టారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి ఆధ్వర్యంలో వరుణ యాగాన్ని మంగళ వాయిద్యాలతో బాలలయం నుండి వైదికశాల ప్రవేశం అనంతరం గురు ప్రార్థన, వరుణ యాగ సంకల్పం, గణపతి పూజ, పుణ్యహవాచణం, నాంది ముఖం, నవగ్రహ మండప వరుణ కళశస్థాపన, అగ్ని ప్రతిష్ట, వరుణ జపములు స్థాపిత దేవతా పూజ హోమములు, నిర్వహించారు. ఆలయ ఈఓ అంజని దేవి మాట్లాడుతూ వర్షాలు బాగా కురిసి పాడి పంటలు పండి రాష్ట్ర,దేశ ప్రజలు అందరూ ఆనందంగా ఉండాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఈవో తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఈవో గంగ శ్రీనివాస్, సూపరింటెండెంట్ లు శివరాజ్, సంజీవ రావు, అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.








# కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ!

- లోక్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం
- గాంధీభవన్ ముట్టడికి బీజేపీ నేతల దూకుడు
- ఇరువర్గాల పరస్పరం దాడులతో ఉద్రిక్తత
- రంగంలోకి దిగి అదుపు చేసిన పోలీసులు
- నగరంలో పలువురు కాంగ్రెస్, బీజేపీ నేతల అరెస్ట్






**హైదరాబాద్, జూలై 22 (మన చౌరాస్తా) :** కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లోక్‌భవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గాంధీ భవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు తెగించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు. మరోపక్క.. రాజ్ భవన్ ముట్టడికి యత్నించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు నాంపల్లి పీఎస్‌కు తరలించారు. కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి నాంపల్లి పీఎస్‌కు చేరుకున్నారు. ఖైరతాబాద్‌లో కూడా కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. నెక్లెస్ రోడ్డులోని ఐమాక్స్ సమీపంలో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం దగ్గరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లోక్ భవన్ ముట్టడికి యత్నించిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఘటనా స్థలంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్దకు చేరుకున్న బీజేపీ నాయకులను అక్కడే అడ్డుకున్నారు. అలాగే లోక్‌భవన్ వైపు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద నిలువరించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ రాష్ట్ర కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా కర్రలతో దాడులు జరిగాయని, కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసు వాహనాలపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేసినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ముందస్తు చర్యల్లో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. తొలుత కాంగ్రెస్ నేతలు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కరీంనగర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లగా... వారిని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా అడ్డుకున్నారు. చేతుల్లో కర్రలతో బండి సంజయ్ ఇంటికి బీజేపీ నేతలు కాపలాగా నిలవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బీజేపీ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, చెప్పులతో దాడులకు తెగబడ్డారు. ఇరుపార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో కరీంనగర్ వీధులు రణరంగాన్ని తలపించాయి. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉద్రిక్తతలను అదుపు చేసేందుకు లాఠీలకు పనిచెప్పారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలను చెదరగొట్టి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా... కాంగ్రెస్ దాడికి నిరసనగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బీజేపీ శ్రేణులు యత్నించాయి. అయితే వారిని కాంగ్రెస్ నేతలు అడ్డుకోవడంతో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రెండు ప్రధాన పార్టీల సవాల్ `ప్రతిసవాల్‌తో కరీంనగర్‌లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

## సీసీఐ పునరుద్ధరణపై
# మీ వైఖరి ఏంటి?

- జిల్లా అభివృద్ధికి సిమెంట్ ఫ్యాక్టరీ అతి ముఖ్యం
- సీఎం రేవంత్‌కు బీఆర్ఎస్ నేత కేటీఆర్ లేఖ



**హైదరాబాద్, జూలై 22 (మన చౌరాస్తా) :** ఆదిలాబాద్ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆదిలాబాద్ అభివృద్ధికి సీసీఐ పునరుద్ధరణ కీలకమని.. రూ.250 కోట్ల రాష్ట్ర వాటాతో పునరుద్ధరణ సాధ్యమేనని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడమే జాప్యానికి కారణమన్న కేటీఆర్ సీసీఐ పునరుద్ధరణపై రేవంత్ ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రతిపాదనలను ప్రస్తావించారు. ఆదిలాబాద్ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ చిత్త శుద్ధి లోపం వల్లే జాప్యం జరిగిందని.. సీసీఐపై ఆరు కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇటీవలే సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీసీఐ సాధన సమితి బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు / ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసిందని తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశాం. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప్లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.




## కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఆందోళన

- హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో పొన్నం ఆందోళన

**సిద్దిపేట, జూలై 22(మన చౌరాస్తా) :** కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలోమంత్రి పొన్నం ప్రభాకర్ ధర్నాకు దిగారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , ప్రియాంక గాంధీ, ఇతర ఎంపీలు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల అరెస్టులను నిరసిస్తూ మహాధర్నా నిర్వహించడం జరిగింది. ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన శాంతియుత పార్లమెంట్ మార్చ్‌పై జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పొన్నం తెలిపారు.. నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి సమాధానం చెప్పాలి. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. నీట్ అంశంపై పార్లమెంట్ లో సమగ్ర చర్చ జరపాలి. పేపర్ లీకేజీపై కేంద్ర హోంమంత్రి సమాధానం చెప్పాలి. ఈ ఘటనల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడ్డ విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలి. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌పై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో నిరసన. మహా ధర్నాలో అన్ని మండలాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం, న్యాయం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మా పోరాటం కొనసాగుతుందని మంత్రి హెచ్చరించారు.

## బీజేపీ కార్యాలయం వద్ద
# ఉద్రిక్త పరిస్థితి

- రామచంద్రరావు, ఎమ్మెల్యే రాకేశ్‌ల ముందస్తు అరెస్ట్
- కరీంనగర్‌లో బండి కార్యాలయంపై దాడికి యత్నం

**హైదరాబాద్, జూలై 22 (మన చౌరాస్తా) :** కాంగ్రెస్, బిజెపిల ఆందోళనలో భాగంగా హైదరాబాద్ బిజెపి కార్యాలయం వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. గాంధీభవన్ ముట్టడికి బీజేపీ పిలుపు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో బీజేపీ నేతలు పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. నేతల అరెస్టుల సందర్భంగా పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. బీజేపీ నాయకుల అరెస్టుపై పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నివాసం ఎదుట మంగళవారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళన చేశారు. దీనికి నిరసనగా బీజేపీ అగ్రనేతలు గాంధీభవన్‌ను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో హై టెన్షన్ నెలకొంది. కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద కూడా ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. కాంగ్రెస్ నేతలను అడ్డుకునే క్రమంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. నంతరం కాంగ్రెస్ కార్యకర్తలు బండి సంజయ్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో ఆఫీసు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత కొనసాగింది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. రాష్ట్రంలో ఒకే రోజు బీజేపీ రాష్ట్ర కార్యాలయం, కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఈ పరిణామాలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడుతున్నారు.





## రాహుల్ గాంధీ అరెస్ట్‌తో
# హనుకొండలో నిరసన

- హన్మకొండలో ఆందోళనలో పాల్గొన్న భట్టి, కొండా సురేఖ
- కేంద్రం తీరుపై మండిపడ్డ డిప్యూటీ సీఎం భట్టి

**హన్మకొండ, జూలై22 (మన చౌరాస్తా) :** కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా అరెస్ట్ చేయడాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు ను నిరసిస్తూ హన్మకొండ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి కొండ సురేఖతో కలిసి భట్టి విక్రమార్క తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజుతో పాటు పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలను కర్కశంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తీవ్రంగా అవమానించడమేనని మండిపడ్డారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీతో దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని, ఈ అక్రమాలపై ప్రశ్నిస్తూ ఆందోళన చేస్తున్న అమాయక విద్యార్థులు, ఆడపిల్లల పట్ల పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించి లాఠీఛార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో దేశంలో అరాచక పాలన సాగుతోందని, ప్రజల సమస్యలు వినడం మానేసి ప్రశ్నించిన వారిపై దాడులు, అరెస్టులు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. లాఠీలతో విద్యార్థుల గొంతును, అరెస్టులతో రాహుల్ గాంధీ పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం ఆపలేదని స్పష్టం చేశారు. దేశ యువత భవిష్యత్తు కోసం, విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి రాహుల్ గాంధీ దిక్సూచిలా నిలిచి పోరాడుతున్నారని.. కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్షాలు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆఖరి వరకు పోరాడతాయని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ చేపడుతున్న ఈ పోరాటానికి దేశంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

## నీట్‌పై కేంద్ర వైఖరి దారుణం..

- విద్యార్థులపై లాఠీఛార్జీ అమానుషం
- రాహుల్‌కు మద్దతుగా నిత్యం ఆందోళనలు
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి, జూలై 22 (మన చౌరాస్తా):** మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి విమర్శించారు. బుధవారం సంగారెడ్డిలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా ఢిల్లీలో నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ వేలాది మంది యువత ఆందోళన బాట పట్టారని చెప్పారు. ఆందోళనకు దిగిన వారిని దారుణంగా రక్తం వచ్చేలా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. ప్రధాని మోదీ నివాసాన్ని ముట్టడిస్తే.. ఆయన్ని కూడా అరెస్ట్ చేశారని అన్నారు. విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని.. అలాగే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని రాహుల్ డిమాండ్ చేశారని జగ్గారెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీకి మద్దతుగా మంగళవారం హైదరాబాద్ ` ముంబై నేషనల్ హైవే ముట్టడించామన్నారు. బుధవారం నల్ల దుస్తులతో నిరసన ర్యాలీ చేశామని చెప్పారు. గురువారం కూడా ఆందోళన చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బ్లాక్ టీషర్ట్‌లు ధరించిన వెయ్యి మంది కాంగ్రెస్ కేడర్‌తో ఈ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. రాహుల్, ప్రియాంకలతోపాటు విద్యార్థులకు మద్దతుగా ప్రతి రోజు నిరసన కార్యక్రమాలు చేపడతామని వివరించారు. రాహుల్ గాంధీ ఆందోళన చేసినన్ని రోజులు సంగారెడ్డిలో ఆందోళనలు జరుగుతూనే ఉంటాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

# విద్యార్థుల భవిష్యత్ టీచర్ల చేతుల్లోనే..

- విద్యా వ్యవస్థలోనూ పారదర్శకత, నాణ్యత ఉండాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ




**జనగామ, జూలై 22 (మన చౌరాస్తా) :** విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని, అయితే వాటికి నిజమైన సార్థకత ఉపాధ్యాయుల బోధనా విధానంపైనే ఆధారపడి ఉంటుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అన్నారు. ఆధునిక బోధన-అభ్యాసన పద్ధతులపై లింగాల ఘనపూర్ మండలం నెల్లూట్ల హై స్కూల్ లో నిర్వహిస్తున్న సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమానికి బుధవారం, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే నిరుపేద విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని పేర్కొన్నారు. తరగతి గదిలోకి వచ్చే ప్రతి విద్యార్థి విద్యావంతుడిగా, సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దే బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. ఉపాధ్యాయులు ప్రతిరోజూ పాఠ్యాంశాలపై ముందస్తు ప్రణాళికతో సిద్ధమై తరగతులకు హాజరై, విద్యార్థుల్లో నేర్చుకోవాలనే ఆసక్తిని పెంపొందించే విధంగా బోధించాలని సూచించారు. ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకతకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో, విద్యా వ్యవస్థలోనూ అదే స్థాయిలో పారదర్శకత, నాణ్యత ఉండాలన్నారు. విద్యార్థులకు భారత రాజ్యాంగంలోని ఉపోద్ఘాతం, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ప్రజాస్వామ్య విలువలు, ముఖ్యమైన రాజ్యాంగ ఆర్టికల్స్‌పై సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఉన్నత పాఠశాలలో ప్రపంచ పటం, భారతదేశ భౌతిక, రాజకీయ పటాలతో పాటు రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలు, ఆర్టికల్స్‌ను ప్రదర్శించే సమాచార పట్టికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రపంచం గురించి, దేశం గురించి, రాజ్యాంగం గురించి అవగాహన పెంపొందించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జియోగ్రఫీ ఎంతో ఆసక్తికరమైన సబ్జెక్ట్ అని పేర్కొన్న కలెక్టర్, ప్రపంచ దేశాలు, దీవులు, "గేట్ వే ఆఫ్ యూరప్" వంటి భౌగోళిక అంశాలతో పాటు ఎల్లోరా గుహలు, శిల్పకళా వైభవం, ఎకనామిక్స్‌లో డిమాండ్-సప్లై, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల విధులు, ఎన్నికల కమిషన్ బాధ్యతలు వంటి అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ప్రపంచ పటంలో వివిధ దేశాల స్థానాలు, భౌగోళిక అంశాలపై ప్రశ్నించి వారి పరిజ్ఞానాన్ని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు అన్ని విషయాలు ఒకేసారి తెలియవని, కానీ తెలుసుకోవాలనే ఆసక్తిని కలిగించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని అన్నారు. అనంతరం కలెక్టర్ పదవ తరగతి గదిని సందర్శించి, గణితంలోని పలు అంశాలను విద్యార్థులకు సులభ పద్ధతిలో వివరించారు. అలాగే విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి, వారి అభ్యాస సామర్థ్యాన్ని పరిశీలించి, మరింత కృషి చేసి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు.

# అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య



**తరిగొప్పుల, జూలై 22 (మన చౌరాస్తా) :** అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగిన ఓ మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషాదకర సంఘటన జనగామ జిల్లా తరిగొప్పుల మండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. తరిగొప్పుల గ్రామానికి చెందిన భీమిరెడ్డి ఉమా (50) తన కుమార్తె విజయ వివాహానికి, అలాగే ఒక ఎకరం భూమి, ట్రాక్టర్ కొనుగోలు కోసం వివిధ మార్గాల్లో సుమారు రూ.18 లక్షల వరకు అప్పులు చేశారు. రోజురోజుకూ పెరిగిపోతున్న అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురైన ఉమా ఈ నెల 17న తమ వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగింది. ఇది గమనించిన అక్కడే పనిచేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ గణేష్ వెంటనే స్పందించి ఆమెను జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున ఆమె తుదిశ్వాస విడిచారు. మృతురాలి కుమారుడు రజినీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు తరిగొప్పుల ఎస్సై శ్రీదేవి తెలిపారు.



# జనగామ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా శ్రీధర్ గౌడ్ నియామకం

**జనగామ, జూలై 22 (మన చౌరాస్తా) :** జనగామ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా నర్మెట సర్పంచ్ గోపగోని శ్రీధర్ గౌడ్ నియామక పత్రాన్ని స్వీకరించారు. హైదరాబాద్‌లోని పంచాయతీ రాజ్ చాంబర్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో, పంచాయతీ రాజ్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి చేతుల మీదుగా ఆయన ఈ అధికారిక పత్రాన్ని అందుకున్నారు. నర్మెట్ట గ్రామాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి శ్రీధర్ గౌడ్ అందిస్తున్న సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి, గ్రామ పంచాయతీల బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీధర్ గౌడ్ తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రజాప్రతినిధులు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన నియామకం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ, మాజీ అధ్యక్షుడు సంపత్ నాయక్, వెంకట్, సర్పంచులు నీల కరుణాకర్, బానోత్ మహేందర్ నాయక్, కొర్ర రాజేందర్ నాయక్ తదితరులు పాల్గొని శ్రీధర్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# రేషన్ కార్డుదారులు ఈకేవైసీ పూర్తి చేయండి

**జనగామ, జూలై 21 (మన చౌరాస్తా) :** జనగామ జిల్లాలోని రేషన్ కార్డుదారులందరికీ ఈకేవైసీ ప్రక్రియ తప్పనిసరి అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ వెల్లడించారు. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), రాష్ట్ర ఆహార భద్రతా కార్డుల (FSC) కింద నమోదైన లబ్ధిదారులందరూ తమ వివరాలను సరిచూసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. రేషన్ పంపిణీలో ఎలాంటి అంతరాయం కలగకుండా ఉండటానికి కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు.

- **ఉచిత ప్రక్రియ** : లబ్ధిదారులు తమ సమీపంలోని చౌక ధరల దుకాణాన్ని (రేషన్ షాప్) సందర్శించి EKYC ప్రక్రియను ఉచితంగా పూర్తి చేసుకోవచ్చు.
- **కావాల్సిన పత్రాలు** : రేషన్ షాప్‌కు వెళ్లేటప్పుడు అసలు రేషన్ కార్డుతో పాటు ఆధార్ కార్డును తప్పనిసరిగా తీసుకెళ్లాలి.
- **బయోమెట్రిక్ తప్పనిసరి** : రేషన్ కార్డులో పేరున్న ప్రతి కుటుంబ సభ్యుడు ప్రత్యక్షంగా వెళ్లి ఇపాస్ యంత్రంపై తమ వేలిముద్ర వేయాల్సి ఉంటుంది.
- ఈ నెల 31వ తేదీ లోపు ఈకేవైసీ పూర్తి చేయని వారి యూనిట్‌ను రేషన్ కార్డు నుండి తొలగించనున్నట్లు కలెక్టర్ హెచ్చరించారు.

## విద్య, వైద్య, వ్యవసాయ రంగాలను
# బలోపేతం చేయాలి : సీపీఎం




**జనగామ, జూలై 22 (మన చౌరాస్తా) :** దేశాభివృద్ధిలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు కీలక పాత్ర పోషిస్తాయని, వాటిని ప్రభుత్వ రంగంలో బలోపేతం చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. బుధవారం సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాపర్తి రాజు అధ్యక్షతన జనగామ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులలో కనీస సౌకర్యాలు కల్పించి నాణ్యతా ప్రమాణాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని, ప్రైవేట్ ఆసుపత్రుల అక్రమాలను అరికట్టాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లా కరువు ఛాయల్లో ఉందని, రైతాంగాన్ని ఆదుకోవడానికి పంట రుణాలు, ప్రత్యామ్నాయ పంటలకు ఉచిత విత్తనాలు అందించాలని స్పష్టం చేశారు.

### కలెక్టరేట్ గేటుకు వినతిపత్రం..

గత రెండు నెలలుగా నిర్వహించిన సర్వే వివరాలతో కూడిన వినతిపత్రాన్ని ఇచ్చేందుకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సమయం ఇవ్వలేదని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా వ్యవహరించిన అధికారుల తీరును నిరసిస్తూ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిరసన తెలిపి కలెక్టరేట్ ప్రధాన గేటుకే వినతిపత్రాన్ని కట్టి వినూత్న నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, జోగు ప్రకాష్ సుంచు విజయేందర్, పొత్కనూరి ఉపేందర్, బెల్లంకొండ వెంకటేష్, చిట్యాల సోమన్న, గంగాపురం మహేందర్, గుండెబోయిన రాజు, మాచర్ల సారయ్య, తోటి దేవదానం, ఇంటి వెంకటరెడ్డి, పర్వతం నరసింహులు, పల్లెర్ల లలిత, దాసగాని సుమా, పాముకుంట్ల రేణుక, హజ్మీరా సురేష్, ఏదునూరి మదర్, గండి అంజయ్య, పోలాస్ పరమేష్, సోమ సత్యం, పొదల నాగరాజు, గోసంగి శంకరయ్య, బూడిద ప్రశాంత్, సోమయ్య, ఎల్లయ్య, కాసాని తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా
# జనగామలో కాంగ్రెస్ ధర్నా

**జనగామ, జూలై 22 (మన చౌరాస్తా) :** కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అక్రమ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ పిలుపు మేరకు జనగామలో బుధవారం కాంగ్రెస్ శ్రేణులు భారీ నిరసన తెలిపాయి. జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించి, అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ.. నీట్ (NEET) పరీక్షలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా, విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని మండిపడ్డారు. అరెస్టులతో నిజాలను నొక్కేయలేరని, విద్యార్థుల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, యువజన, మహిళా, యూత్ కాంగ్రెస్, NSUI, వివిధ సెల్ల నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

### కాంగ్రెస్ నాయకుల అరెస్టు

ఢిల్లీలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గురువారం జనగామ జిల్లా కేంద్రంలో నిరసన హోరెత్తించాయి. జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ రాస్తారోకో, నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెడ శ్రీనివాస్, దేవస్థానాల చైర్మన్లు గంగం నరసింహారెడ్డి, ఇదులకంటి వెంకటరెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు గుండ శ్రీధర్ రెడ్డి, వగాలబోయిన యాదగిరి, రావుల బిక్షపతి, ఎండీ మసూద్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి వంగల కళ్యాణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.






### టునా చేప కేజీ @ రూ.600

జనగామ పట్టణంలోని కలెక్టర్ భవన సముదాయం ఎదురుగా టునా చేప కాసేపు ట్రెండింగ్ అయింది. యానాం నుంచి తెచ్చామని చెబుతున్న విక్రయదారులు మొత్తం దాదాపు 50 కేజీలు ఉన్న ఈ చేపలో కిలో భాగం రూ.600 అని చెప్పారు. కొత్తగా, వింతగా ఉన్న ఈ చేప భాగాలను కొనేందుకు స్థానికులు ఆసక్తి చూపారు. కలెక్టరేట్ ఎదురుగా ఇలాంటి విక్రయాలు చేయకూడదని పోలీసు ఉన్నతాధికారులు వారిని వేరే చోటకు పంపారు.

- మన చౌరాస్తా, జనగామ





# జనగామలో ఎమ్మెల్సీ బస్వరాజు పర్యటన

**జనగామ, జూలై 22 (మన చౌరాస్తా) :** ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య బుధవారం జనగామ జిల్లాలో పర్యటించారు. పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యాలయాన్ని సందర్శించి, డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్‌తో కలిసి పార్టీ సంస్థాగత బలోపేతం, పలు కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం జనగామలో ఏర్పాటు చేసిన SIR హెల్ప్ డెస్క్ సెంటర్‌ను పరిశీలించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఏలు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి అర్హులైన ఓటరుకు సేవలు అందించాలని సూచించారు. పట్టణంలో డబుల్ ఓట్లు నమోదయ్యే అవకాశం ఎక్కువ ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచ రాములు, డాక్టర్ రాజమౌళి, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు మజీద్ అప్సర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేముల మల్లేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడల సిద్దయ్య గౌడ్, డీసీసీ జనరల్ సెక్రటరీ అన్వర్, కౌన్సిలర్లు అండాలు, తారీక్, నాయకులు జాయ మల్లేష్, మున్నీ బేగం, ఇస్మాయిల్, అలీమొద్దీన్, ఖాదర్, బోరెల్లి సిద్ధులు, నోముల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



జనగామ, జూలై 22 (మన చౌరాస్తా) : జనగామ పట్టణంలోని 5వ వార్డు ఏసి రెడ్డి నగర్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తక్షణమే సేఫ్టీ ఫెన్సింగ్ (కంచె) ఏర్పాటు చేయాలని సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ విద్యుత్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ కంచె లేకపోవడంతో ఎర్తింగ్ వైర్లు, పవర్ వైర్లు అత్యంత ప్రమాదకరంగా వేలాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యురాలు పల్లెర్ల లలిత, నాయకులు మారబోయిన మల్లయ్య, చీర రజిత, పసలాది పోశయ్య, జెరిపోతుల యాకయ్య, గంపల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్పీడ్‌గా.. స్పిరిట్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం స్పిరిట్ పై అభిమానుల్లో రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. సినిమా ప్రకటించిన నాటి నుంచి ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజాగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షూటింగ్ పురోగతిపై కీలక సమాచారం వెల్లడించారు. అమెరికాలోని నార్త్ కరోలినాలో జరిగిన తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా, అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'స్పిరిట' అప్డేట్‌ను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా పాల్గొన్నారు. వేదికపై మాట్లాడిన సందీప్ రెడ్డి వంగా, 'స్పిరిట' చిత్రీకరణ ఇప్పటికే 40 శాతం పూర్తయిందని వెల్లడించారు. అంతేకాదు, ఈ సినిమా ప్రతి ప్రేక్షకుడికి నచ్చేలా రూపొందిస్తున్నామని, ప్రభాస్ అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సందీప్ చేసిన ఈ ప్రకటనతో ప్రభాస్ అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. సినిమా షూటింగ్ వేగంగా సాగుతుండటంతో విడుదలపై కూడా త్వరలో మరిన్ని అధికారిక ప్రకటనలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో ప్రభాస్ ఓ పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారిగా కనిపించనున్నట్లు సమాచారం. అకాడమీ టాపర్‌గా ఎదిగిన ఓ పోలీస్ అధికారి జీవితంలో జరిగే అనూహ్య పరిణామాలు, అతనిపై వచ్చిన ఆరోపణలు, వాటి వెనుక ఉన్న అసలు నిజం కథలో కీలకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ సరసన బాలీవుడ్ నటి తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రకాష్ రాజ్, వివేక్ ఒబెరాయ్, కాంచన తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీ`సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.



# wanted

## విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

**manachourasta@gmail.com**

**8555800812**　**9676400812**

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

*The Complete News way*


Printed, Published by **UPPALANCHI POORNIMA**, On behalf of UPPALANCHI POORNIMA, Printed at HAMARA WARANGAL Printers &Graphics, # 25-8-182, Babujinagar, Kazipet, Warangal - 506003 and Published from # 4-8-65, Dharmakancha, Jangon, Warangal-506167, Editor : **UPPALANCHI NARENDER**, email : manachourasta@gmail.com, Ph : **8555800812**, PRGI No. TGTEL/25/A4350